

# అశ్రునివాళి

## ఎమ్మెల్యే లాస్యనందితకు కన్నీటి వీడ్కోలు

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందితకు అభిమానులు, రాజకీయ నేతలు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఆమె పార్థివదేహానికి మారేడ్‌పల్లి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు కార్ఖానాలోని నివాసం నుంచి అంతిమయాత్ర కొనసాగింది. అంతకుముందు లాస్య నందిత భౌతికకాయానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.



లాస్యనందిత భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



మంత్రి శ్రీధర్ బాబు



మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఎమ్మెల్యే ముఠాగోపాల్



ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఎమ్మెల్యే మల్లారెడ్డి



ఎమ్మెల్సీ మధుసూదనచారి

# పేదల పెన్నిధిగా.. మన్ననలు పొంది..

కంటోన్మెంట్ : 2015లో మొదటిసారిగా లాస్యనందిత రాజకీయ రంగ ప్రవేశం చేసి కంటోన్మెంట్ బోర్డులోని నాలుగో వార్డు బోర్డు సభ్యురాలిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనూహ్యంగా 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ కార్పొరేటర్‌గా బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచారు. 2021లో జరిగిన ఎన్నికల్లో కార్పొరేటర్‌గా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. లాస్యనందిత తండ్రి సాయన్న 2023 ఫిబ్రవరి 19న అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ క్రమంలో 2023 నవంబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున తొలిసారిగా ఎమ్మెల్యేగా లాస్యనందిత గెలుపొందారు. అతి తక్కువ సమయంలోనే సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించుకున్నారు. తండ్రి సాయన్న బాటలో నడుస్తూ.. పేదల పెన్నిధిగా ప్రజల మన్ననలు పొందారు.



లాస్యనందిత భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

### చుట్టుముట్టిన ఇబ్బందులు

ఎమ్మెల్యేగా లాస్యనందిత గెలుపొందిన నాటి నుంచి ఆమెకు ఇబ్బందులు చుట్టిముట్టాయి. గతేడాది డిసెంబర్ చివరి వారంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి పాల్గొనేందుకు వచ్చి..లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. ఈ ఏడాది జనవరిలో అనారోగ్య సమస్యలతో వారం పాటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. అలాగే ఫిబ్రవరి 13న నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని వస్తూ.. నార్కట్‌పల్లి వద్ద కారుకు ప్రమాదం జరగడంతో ఎమ్మెల్యే లాస్యనందిత స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సరిగ్గా పదిరోజులకు శుక్రవారం తెల్లవారు జామున పటాన్‌చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు.

### కలిసిరాని ఫిబ్రవరి

సరిగ్గా ఏడాది కిందట ఫిబ్రవరి 19న ఎమ్మెల్యే సాయన్న చనిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న ఎమ్మెల్యే లాస్యనందితకు ప్రమాదం జరగడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్యనందిత ప్రాణాలు కోల్పోయారు.



- పేరు : గ్యాని లాస్య నందిత
- పుట్టిన తేదీ : 07/09/1986
- ఎస్ఎస్‌సీ. : సెయింట్ అంథోని హైస్కూల్, సికింద్రాబాద్
- ఇంటర్ : 2004.. రత్న జూనియర్ కళాశాల
- బీటెక్ : 2012.. సీఎస్‌సీ, మల్లారెడ్డి కాలేజీ
- 2015లో తొలిసారిగా రాజకీయాల్లోకి అరంగేట్రం
- 2015లో కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని నాలుగో వార్డు నుంచి పోటీ చేసి ఓటమి
- 2016లో తండ్రి సాయన్నతో కలిసి బీఆర్ఎస్‌లో చేరి.. కవాడిగూడ కార్పొరేటర్‌గా విజయం
- 2021లో మరోసారి కవాడిగూడ కార్పొరేటర్‌గా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి
- 2023 ఫిబ్రవరి 19న తండ్రి సాయన్న మరణంతో గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లాస్యనందిత కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు
- 2023 డిసెంబర్ 24న బోయిన్‌పల్లిలోని ఓ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి బయటపడ్డారు.
- ఈ ఏడాది జనవరిలో వారం రోజుల పాటు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స
- ఈ నెల 13న నల్గొండ సభకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.
- ఈ నెల 21న చివరిసారి మడ్‌ఫోర్ట్ దోభీ ఘాట్ వద్ద ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న దక్షిణ కాళీ మాత దేవాలయ భూమి పూజలో పాల్గొన్నారు.
- శుక్రవారం తెల్లవారుజామున పటాన్‌చెరువు సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్యనందిత ప్రాణాలు కోల్పోయారు.



## సీటు బెల్టు పెట్టుకొని ఉంటే..

# ప్రాణాలు దక్కేవి..

### అతివేగం.. నిర్లక్ష్యంతో గాల్లో కలుస్తున్న నిండు ప్రాణాలు

### ప్రముఖులను కలవరపెడుతున్న రోడ్డు ప్రమాదాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): అనుకోకుండా వచ్చేది ప్రమాదం.. ఎప్పుడు వస్తుందో తెలియదు.. అందుకే అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంటుంది. రెప్పపాటులో జరిగే ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యం..నిండు ప్రాణాలను తీస్తున్నాయి. డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం వంటి ప్రధాన కారణాలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(37) సైతం సీట్ బెల్ట్ పెట్టుకోలేదు.

### 16,715 మంది..

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023లో విడుదల చేసిన లెక్కల ప్రకారం 2022లో 461312 రోడ్డు ప్రమాదాలు జరుగగా అందులో 168491 మంది మృతి చెందారు. మిగతా వారు గాయపడ్డారు. అయితే చనిపోయిన వారిలో 16715 మంది సీట్ బెల్ట్ ధరించలేదని తేలింది.

### ప్రముఖుల మరణాలు..

- గత ఏడాది ఏపీలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ వెస్ట్‌గోదావరి జిల్లా ఉండి మండలంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఆయన సీట్ బెల్ట్ పెట్టుకోలేదని తేలింది.
- 2022లో టాటా సంస్థ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ అహ్మదాబాద్, ముంబై హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఖరీదైన కారులో వెళ్లినా.. సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడంతో ప్రాణాలు కోల్పోయారు.
- 2014లో నందమూరి జానకీరామ్, 2018లో ఆయన తండ్రి టీడీపీ నాయకులు హరికృష్ణ రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. ఆ సమయంలో వారు సీటు బెల్టు ధరించలేదు.
- నాయకుడు ఇంద్రారెడ్డి, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొడుకు ప్రతీక్‌రెడ్డి, ఎర్రం నాయుడు, లాల్‌జాన్ పాషా, శోభనాగిరెడ్డి రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సీట్ బెల్ట్ ధరించకపోవడంతోనే వీరు చనిపోయారు.

## డబుల్ బెడ్రూం విచారణ అంటూ..

ఉప్పల్, ఫిబ్రవరి 23: డబుల్ బెడ్రూం ఇండ్ల విచారణ పేరుతో ఓ వృద్ధురాలిని దోచుకున్నారు దుండగులు. ఉప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. హనుమ సాయినగర్‌లో నివాసముండే రమాదేవి(62) ఇంటికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. 'ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు కదా.. డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించిన విచారణ అధికారులమం'టూ.. నమ్మించారు. ఇంటి బయట కారులో సార్ ఉన్నారని తెలిపారు. వారి మాటలను నమ్మిన రమాదేవి.. ఇంటి నుంచి బయటకు రాగా.. ఆమెను కారులో ఎక్కించుకొని.. నాగోల్ మెట్రోస్టేషన్ సమీపంలోకి తీసుకెళ్లి..బెదిరించారు. 8 తులాల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

## కాంగ్రెస్ సర్కారు ఎక్కువ కాలం ఉండదు

### నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 23: మోసపూరిత పునాదులపై కాంగ్రెస్ పార్టీ నిలబడిందని, ఇది ఎక్కువ కాలం కొనసాగే పరిస్థితి లేదని నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. 4వ రోజు బీజేపీ విజయ సంకల్ప యాత్ర సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లిలోని టీఎల్ఎం గార్డెన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలోనే భారతదేశం ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నదన్నారు. నరేంద్రమోదీ నాయకత్వాన్ని మరోసారి ప్రజలు కోరుకుంటున్నారన్నారు. భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి , బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత, కొండల్‌రెడ్డి, మల్లారెడ్డి, మల్లేశ్‌యాదవ్, బాజీ మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనలేమితోనే ఎండోమెట్రియోసిస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 ( నమస్తే తెలంగాణ ) : అవగాహనలేమితో మహిళలు ఎక్కువగా ఎండో మెట్రియోసిస్ బారినపడుతున్నారని 'ఎండో మెట్రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' వ్యవస్థాపకురాలు డాక్టర్ బింద్ర చెప్పారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం 'ఎల్లో రిబ్బన్ రన్'పై ఆమె విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బింద్ర మాట్లాడుతూ.. పది మంది మహిళల్లో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిపారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు మార్చి 3న నెక్లెస్ రోడ్డులో ఉదయం 6 గంటలకు 'ఎల్లో రిబ్బన్ రన్' నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయలేమని.. దాని ప్రభావాన్ని తగ్గించేందుకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే క్రమేణా వంధత్వం, ఊపిరితిత్తులు, కిడ్నీ తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. ఫ్యూచరిక్ సిటీస్ ప్రెసిడెంట్ కరుణా గోపాల్ వర్తకవి మాట్లాడుతూ.. మహిళలను శారీరకంగా, మానసికంగా కుంగుబాటుకు గురిచేసే ఈ భయానక వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని చెప్పారు. అనంతరం ఎల్లో రిబ్బన్ రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను వక్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్వేత , అర్చన, నటుడు శివ కందుకూరి, నటి రాశీసింగ్ తదితరులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం

### 23వ పోలీసు జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్‌లో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా

మొయినాబాద్, ఫిబ్రవరి 23: నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకమని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా అన్నారు. రంగారెడ్డి జిలా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో పోలీసు జాగిలాల 23వ పాసింగ్ ఔట్ పరేడ్ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నో కేసుల్లో నేరస్తులను పట్టుకోవడంలో పోలీసులకు జాగిలాలు ఎంతో సహకరించాయని చెప్పారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పొందిన జాగిలాలు ఉత్తమ ప్రతిభ చూపి.. దేశంలోని ఇతర రాష్ట్రాల పోలీసులకు నుంచి ప్రశంసలు పొందుతున్నాయని ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. ఐఐటీఏలో ఇప్పటి వరకు 771 జాగిలాలకు శిక్షణ ఇచ్చినట్లు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన జాగిలాలకు కూడా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, శిక్షణ పొందిన జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అలాగే ఐఐటీఏలో నూతనంగా నిర్మించిన క్రికెట్ మైదానాన్ని డీజీపీ రవిగుప్తా ప్రారంభించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం



సరదాగా క్రికెట్ ఆడుతున్న డీజీపీ రవిగుప్తా

## పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ వేగవంతం

మేడ్చల్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 26 నుంచి రెండో విడత ఈవీఎం, వీవీ ప్యాట్ల పరిశీలన ప్రారంభించనున్నారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ నేతృత్వంలో వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందం ఈవీఎం, వీవీ ప్యాట్లను పరిశీలించనున్నారు. వారం రోజుల పాటు కలెక్టరేట్‌లో ఈ ప్రక్రియ ఉంటుంది.